25-05-2025
ఆదివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 237 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## కరోనా కొత్త వేరియంట్

✍ జయభేరి, హైదరాబాద్, మే 24:

సింగపూర్, చైనా, థాయిలాండ్‌లోనే కాదు.. భారత్‌లోనూ యాక్టివ్ కేసులు చాపకింద నీరులా పెరుగుతున్నాయి. కొత్త కేసులు నమోదు కావడం కలకలం రేపుతోంది. భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో కరోనావైరస్ జె.ఎన్. 1 వేరియంట్ వ్యాప్తి చెందుతోంది. ప్రస్తుతం మహారాష్ట్రలో 45 కొవిడ్ యాక్టివ్ కేసులు ఉండగా.. కర్నాటకలో 35, ఢిల్లీలో 27 కొవిడ్ యాక్టివ్ కేసులున్నాయి. ఢిల్లీలో నిన్న ఒక్కరోజే 23 కరోనా కేసులు నమోదయ్యాయి.. తెలుగు రాష్ట్రాల్లోనూ కరోనా కలకలం రేపింది. విశాఖ, కడపలో రెండు కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఓ ప్రైవేట్ డాక్టర్‌కు పాజిటివ్ గా నిర్ధారణ అయింది. అయితే.. కరోనా కేసులు పెరగడానికి కారణం.. కోవిడ్ JN. 1 వేరియంట్ అని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది కోవిడ్ కొత్త వేరియంట్ గా చెబుతున్నారు.. కానీ ఇది నిజంగా కొత్త వేరియంటా..? దాని గురించి భయపడాల్సిన అవసరం ఉందా? కరోనా కేసులు పెరగడంపై నిపుణులు ఏం చెబుతున్నారు..? ఈ వివరాలను తెలుసుకోండి.. దేశవ్యాప్తంగా జె.ఎన్. 1 వేరియంట్ కేసులు వెలుగులోకి వస్తున్నాయని ఢిల్లీ ఎయిమ్స్‌లో ...మిగతాది 2 లో



## కేటీఆర్ కవిత కు స్వీట్ వార్నింగ్



తెలంగాణకు పట్టిన దెయ్యం రేవంత్ రెడ్డి, తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ పార్టీ. ప్రస్తుతం వాటిని ఎలా వదిలించుకోవాలన్న దానిపై తమ పార్టీ ఫోకస్ చేసిందన్నారు కేటీఆర్. తన సోదరి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తమ తండ్రి కేసీఆర్‌కు రాసిన లేఖపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించారు. ప్రతి పార్టీలోనూ అధ్యక్షుడికి నేతలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలనుకుంటారు. కానీ బీఆర్ఎస్‌లో అందరికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉన్నాయని అర్థం చేసుకోవాలన్నారు. మా పార్టీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కోవర్టులు ఉండొచ్చు అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

✍ జయభేరి, హైదరాబాద్, మే 24 :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలతో చర్చలు, సమీక్షా సమావేశాలు జరిపాం. కొందరు నేతలు తమ అభిప్రయాలను చిట్టీలు రాసిచ్చారు. కొందరు నేతలు నేరుగా మైకుల్లోనే మాట్లాడి తమ అభిప్రాయాన్ని చెప్పారు. కొందరైతే కేసీఆర్‌కు ఇవ్వాలని చెప్పి మరీ చిట్టీలు కూడా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీది ఓపెన్ కల్చర్, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగిస్తాం. పార్టీలో డెమోక్రసీ ఉంది కనుక ఎవరైనా పార్టీ అధినేత కేసీఆర్ ...మిగతాది 2 లో



## అయోధ్యలో వేగంగా రామ మందిర పనులు

**సప్త మందిర విభాగం నిర్మాణం పూర్తి**

✍ జయభేరి, లక్నో, మే 24:

అయోధ్యలోని రామ జన్మభూమి ఆలయ నిర్మాణ పనులు ఇప్పుడు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఆలయ నిర్మాణం పనులకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా పంచుకున్నారు. రామ దర్బారలో ప్రతిష్టించాల్సిన దైవిక విగ్రహాలు ఈ రోజు ఎప్పుడైనా ఆలయ ప్రాంగణానికి చేరుకోవచ్చని చెప్పారు. ఈ విగ్రహాలను మొదటి అంతస్తులో ప్రతిష్టిస్తారు. రామ దర్బార్ లో శ్రీరాముడు, సీత దేవి, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు కొలువు దీరనున్నారు.ప్రాణ ప్రతిష్ఠకి సంబంధించిన మతపరమైన ఆచారాలు జూన్ 3 నుంచి ప్రారంభమై జూన్ 5న ముగుస్తాయి. ఈ ప్రత్యేక సందర్భానికి ముందు.. ప్రధాన ఆలయ నిర్మాణ పనులన్నీ పూర్తవుతాయి. ప్రాకారము, శేషావతార ఆలయం వంటి మిగిలిన నిర్మాణం పనులు సెప్టెంబర్ , అక్టోబర్ మధ్య పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు.సప్త మందిర విభాగం నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. అక్కడ ఋషులు, సాధువుల విగ్రహాలను ప్రతిష్టించారు. అంతేకాదు ఈ ఆలయం మధ్యలో ఉన్న పుష్కరణి నిర్మాణం కూడా పూర్తయింది. నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ప్రకారం.. 2020 లో నిర్ణయించిన నిర్మాణ ప్రణాళికలోని అన్ని పనులు 2025 ఏడాది చిరకి పూర్తవుతాయి.ఆలయానికి సంబంధించిన గేట్ల గురించి మాట్లాడుకుంటే.. నాలుగు ప్రధాన గేట్లు నిర్మిస్తున్నారు. వీటిలో ఉత్తర ద్వారం మే నాటికి సిద్ధంగా ఉండాల్సి ఉంది.. అయితే నిర్మాణంలో తలెత్తిన కొన్ని సాంకేతిక అడ్డంకుల కారణంగా.. ఈగేటు ఇప్పుడు జూన్ 30 నాటికి పూర్తవుతుంది. దీని తరువాత గేట్ నంబర్ 11 నిర్మాణం ఆగస్టు చివరి నాటికి పూర్తవుతుంది. గేట్ నంబర్ 3 నిర్మాణం పని ప్రారంభమవుతుంది.దీనితో పాటు ఆడిటోరియం, అతిథి గృహం, ఇతర సౌకర్యాల నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రామమందిర నిర్మాణం షెడ్యూల్ ప్రకారం జరుగుతోంది, త్వరలో ఈ దివ్య నివాసం పూర్తవుతుందని చెప్పారు నృపేంద్ర మిశ్రా.

## ట్రంప్.. మరో షాక్...

- 788 మంది భారతీయ విద్యార్థుల పరిస్థితేలంటి?

✍ జయభేరి, న్యూఢిల్లీ, మే 24:



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌హార్వర్డ్ యూనివర్సిటీ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత ఆగే సంకేతాలు కనిపించడం లేదు. ఇంతలో, ట్రంప్ ప్రభుత్వం ఒక షాకింగ్ నిర్ణయం తీసుకుంది. విదేశీ విద్యార్థులు ప్రస్తుతానికి హార్వర్డ్‌లో ప్రవేశం పొందలేరు. విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని నిలిపివేసిస్తూ ట్రంప్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. దీంతో భారతదేశం తోపాటు ప్రపంచంలోని ఇతర దేశాల విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోంది.డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టి నోయెమ్, ఈ మేరకు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి లేఖను పంపారని న్యూయార్క్ టైమ్స్ ఈ వార్తను అందించింది. "హార్వర్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థి, విద్యా మార్పిడి ప్రవేశ కార్యక్రమం గుర్తింపు రద్దు చేస్తున్నట్లు తెలియజేయడానికి ...మిగతాది 2 లో



## టీమిండియాకు ఎదురే లేదు

✍ జయభేరి, న్యూఢిల్లీ, మే 24 :

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశం దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారతదేశం అభివృద్ధి చెందడం ప్రతి భారతీయుడి కల అని అన్నారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందినప్పుడే భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇది 140 కోట్ల మంది దేశప్రజల ఆకాంక్ష. మనం అభివృద్ధి వేగాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం, అన్ని రాష్ట్రాలు టీమిండియా లాగా కలిసి పని చేస్తే, ఏ లక్ష్యం అసాధ్యం కాదన్నారు ప్రధాని మోదీ.ఢిల్లీలో నీతి ఆయోగ్ ముఖ్యమైన సమావేశం జరిగింది. దేశంలోని చాలా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇందులో పాల్గొన్నారు. దేశా అభివృద్ధి వేగాన్ని మనం పెంచాలని ప్రధాని మోదీ అన్నారు. కేంద్రం, అన్ని రాష్ట్రాలు కలిసి కట్టుగా పనిచేసి, ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రతి రాష్ట్రం ప్రపంచ ప్రమాణాల ప్రకారం కనీసం ఒక పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని, అక్కడ అన్ని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ...మిగతాది 2 లో

## రేవంత్ రాజీనామా చేయాలి



✍ జయభేరి, హైదరాబాద్, మే 24:

సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నేషనల్ హెరాల్డ్ కు విరాళాలు సేకరించారన్న కేసులో రేవంత్ రెడ్డి పేరు ఉంది.. అయినా ఇప్పటి వరకు ఎందుకు స్పందించలేదని డీకే అరుణ ప్రశ్నించారు. 80లక్షల రూపాయలు రేవంత్ రెడ్డి సూచనమేరకు విరాళాలు ఇచ్చారని, అనేక మంది విరాళాలు ఇవ్వాలని చెప్పినట్లు సమాచారం. డీకే శివ కుమార్ ఇప్పటికే విరాళాలు ఇచ్చినట్లు ఒప్పుకున్నాడు. రేవంత్ రెడ్డి విరాళాలు పేరుతో ఎంతమంది నుంచి వసూళ్లు చేశారో. ఇప్పటికే ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి జైలుకెళ్లొచ్చాడని డీకే అరుణ అన్నారు.కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేపడుతామని చెప్పారు. కానీ, ప్రకటనలకే తప్ప యాక్షన్ తీసుకోవలం లేదు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ లు ఒకరిని ...మిగతాది 2 లో



## నన్ను వేశ్యగా చూస్తున్నారు

- అందాల పోటీల నుంచి తప్పుకున్న మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి

✍ జయభేరి, హైదరాబాద్, మే 24 :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆతిథ్యమిస్తున్న మిస్ వరల్డ్ 2025 అందాల పోటీలను వివాదాలు చుట్టుముడుతున్నాయి. పోటీలకు వచ్చిన ప్రపంచ సుందీమణులను రేవంత్ సర్కార్ రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సందర్శనకు తీసుకెళ్తున్న విషయం తెలిసిందే. అలా ఇటీవలే రామప్ప ఆలయం సందర్శన సమయంలో అందాల పోటీకి వచ్చిన సుందరీమణుల పాదాలను స్థానిక మహిళలతో కడిగించడచం విమర్శకు దారి తీసిన విషయం తెలిసిందే. ...మిగతాది 2 లో

# కరోనా కలకలం...

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కవితకు కేటీఆర్ స్వీట్ వార్నింగ్

దృష్టికి విషయాలు తీసుకెళ్లవచ్చు. కానీ ఒక్క లేఖతో ఏదో పెద్ద జరిగిపోయిందని హడావుడి చేయాల్సిన అవసరం లేదు.ఏ హోదాలో ఉన్నా అంతర్గతంగా మాట్లాడాల్సిన కొన్ని విషయాలు అంతర్గతంగా చర్చిస్తేనే బాగుంటది. పార్టీ ఫోరమ్స్ ఉన్నాయి, అధ్యక్షుడితో కలిసి మాట్లాడే అవకాశం ఉంటుంది. ఆఫీస్ బేరర్స్ ఉన్నారు. పార్టీలో అందరం కార్యకర్తలమే. అందరికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. ముఖ్యమైన విషయం మాట్లాడుతుంటే మీరు వచ్చి వేరే ముచ్చట అడుగుతారని తెలుసు. మీరు తెలివైన వాళ్లు, అదే సమయంలో నేను కూడా తెలివైన వాడ్నేఅంటూ.. ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు, ఆమె లేఖకు సంబంధించి అడిగిన ప్రశ్నలను కేటీఆర్ దాటవేశారు. అభిప్రాయాలు తెలిపే హక్కు, స్వేచ్ఛ ఉందన్నారు. కానీ లేఖ రాయడానికి గల కారణాలు.. ఆమె పార్టీలో నిజంగానే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే విషయాలపై కేటీఆర్ నోరు విప్పలేదు. అమృత్ పథకంలో భాగంగా రేవంత్ రెడ్డి బామ్మర్దికి వేలకోట్ల ప్రాజెక్టులు ఇచ్చారని సాక్ష్యాధారాలతో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌కు ఫిర్యదు చేసినా పట్టించుకోలేదు. హెచ్‌సీయూ భూములపై సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఆర్థిక నేరం జరిగిందని చెప్పింది. దీనిపై ప్రత్యేకంగా విచారణ చేయడానికి బదులు సైలెంట్ ఉన్నారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ట్యాక్స్.. తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ అని ప్రధాని మోదీ చెప్పినా కూడా వారి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదు. నెల రోజుల్లో స్పందించి చర్యలు తీసుకోవాలని' కేటీఆర్ డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే నెల రోజుల తరువాత ఏం చేయాలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 30, 35 శాతం కమిషన్ లేకపోతే పనులు జరగడం లేదు అని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మా మంత్రులు డబ్బులు ఇవ్వకపోతే పనులు చేస్తలేరు. ఫైల్స్ కదలవు అని చెప్పారు. సొంత పిల్లనిచ్చిన మామ సైతం 94 వేల కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారని రేవంత్ రెడ్డి గుర్తించాలి. ఈ వార్తలు ఎక్కడ రాకపోతే సోషల్ మీడియా ద్వారా వార్తలు ప్రజలకు వెళ్లేలా చేస్తామన్నారు కేటీఆర్.

## నన్ను వేశ్యగా చూస్తున్నారు

'విదేశీ యువతుల కాళ్లు కడిగించడం దారుణం. తెలంగాణ సంస్కృతీసంప్రదాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెట్టింది. దీనికి మహిళా లోకం బాధపడుతున్నది. దీని ద్వారా సమాజానికి ఏం సంకేతం ఇచ్చారు?. సంప్రదాయమంటూ వెనకేసుకురావడం సరికాదు. వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి' అని వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇదే కాదు అందాల భామలకు ఇచ్చిన ఖరీదైన విందు ఇలా ఒకటేంటి ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది ఈ ఈవెంట్. ఇప్పుడు తాజాగా మరో వార్త వెలుగులోకి వచ్చింది. ఈ అందాల పోటీల నిర్వాహకులపై అసంతృప్తితో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగి ఈ పోటీల నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. ఆమె హైదరాబాద్‌ను వీడి ఇంగ్లండ్‌కు వెళ్లిపోయినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతోనే పోటీల నుంచి తప్పుకున్నట్లు నిర్వాహకులకు చెప్పినట్లు తెలుస్తోంది.అయితే, పోటీల నుంచి తప్పుకున్న తర్వాత 'ది సన్' న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ పోటీ నిర్వాహకులపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు తెలిసింది. పోటీ నిర్వాహకులు తనను ఓ వేశ్యగా చూస్తున్నారంటూ సంచలన ఆరోపణలు చేసింది. అంతేకాదు తనతో కొందరు అగౌరవంగా ప్రవర్తించారని చెప్పుకొచ్చింది. వినోదం కోసం మమ్మల్ని వీధుల్లో తిప్పారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు చాలా అసౌకర్యంగా అనిపించిందని చెప్పుకొచ్చింది. అందుకే మనస్తాపంతో పోటీల నుంచి తప్పుకున్నట్లు తన గోడును వెల్లబోసుకుంది. 'సమాజంలో మార్పు తీసుకురావడానికి, యువతలో స్ఫూర్తి నింపేందుకు నేను అక్కడికి వెళ్లాను. అయితే, అక్కడ పరిస్థితులు వేరు. కొందరిని సంతృప్తి పరిచేందుకు కోతుల్లా ప్రదర్శన ఇచ్చేందుకు మేం అక్కడున్నాం. అలాంటి పరిస్థితుల్లో ఉండాల్సి వస్తుందని నేను కలలో కూడా ఊహించుకోలేదు. చాలా అగౌరవంగా అనిపించింది. మనల్ని అక్కడ ఎంత తక్కువగా చూస్తున్నారో అర్థమైంది' అని ది సన్‌తో మిల్లా తన ఆవేదనను చెప్పుకుంది. ప్రస్తుతం ఆమె కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. దీనిపై మరోసారి రేవంత్ సర్కార్‌పై విపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి.

## రేవంత్ రాజీనామా చేయాలి

ఒకరు కాపాడుకుంటున్నారని డీకే అరుణ అన్నారు. గత ప్రభుత్వం సీబీఐని రాకుండా బ్యాన్ విధించింది. గతంలో చెప్పిన విధంగా సీబీఐ విచారణకు ఎందుకు లేఖ రాయడం లేదు. ఈ ప్రభుత్వం కూడా తెలంగాణను దోచుకుంటుంది. హామీలను అమలు చేయడం లో విఫలమైంది. రేవంత్ రెడ్డి పాలించే అర్హత కోల్పోయారు. తెలంగాణ దేశానికే ఆదర్శం అని చెప్పడానికి ఎలా నోరు వస్తుంది..? అంటూ డీకే అరుణ ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన అనంతరం పదేళ్ల పాటు కుటుంబం దోచుకుంది.. ఇప్పుడు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకుని బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నారని అరుణ అన్నారు.రేవంత్ రెడ్డి టాలెంట్ ఎందులో ఉందో అందరికీ తెలుసు. మోదీని నోటికొచ్చినట్టు మాట్లాడుతారు. కేంద్ర ప్రభుత్వం నిధులు లేకపోతే రాష్ట్రంలో అభివృద్ధే లేదు. తెలంగాణ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. తెలంగాణలో బీజేపీ ఎదుగుతుందని జీర్ణించుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని డీకే అరుణ ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ విషయం లో దేశ ప్రధాని, సైనికులకు అండగా ఉండాల్సి ముఖ్యమంత్రి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడు. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ కల్లు బైర్లు కమ్మేలా బుద్ధి చెప్పారు. మన దేశం శక్తిని అందరూ మెచ్చుకుంటుంటే అది జీర్ణించుకోలేక మరో రకంగా మాట్లాడుతున్నారంటూ అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం విఫలమైంది. వర్షాలకు ధాన్యం తడిసి ముద్దె పోతుంది. 60 లక్షల ఎకరాల్లో 130 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చింది. రెండు నెలలు అవుతున్నా కొనుగోలు పూర్తి కాలేదు. రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. రైతులను ఆదుకోవడం మానేసి కుర్చీ కాపాడుకోవడంపైనే రేవంత్ దృష్టి పెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని సరైన సమయం లో సేకరిస్తే మంచి బియ్యం తీయొచ్చు. మరోవైపు, పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాలేదు. నష్టపరిహారం చెల్లించడం లేదు. పునరావాస కేంద్రాలలో పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. పాలమూరు రంగారెడ్డి కి జూరాల నుంచి రావాల్సిన అప్రోచ్ నిర్మించడం లేదు. శ్రీశైలం నుంచి అప్రోచ్ తీసుకోవడం ద్వారా వేల కోట్ల రూపాయలు దుర్వినియోగం అవుతుందని డీకే అరుణ అన్నారు.ప్రజలు బీఆర్ఎస్ అవినీతి చేసినందుకు గద్దె దించారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ఒకరికి ఒకరు కవచంలా ఉంటున్నారు. మాకు అధికారం ఇస్తే ఎవరెంత దోచుకున్నారో చెప్తాం. కవిత లేఖపై మాట్లాడుతూ.. సీక్రెట్ గా రాసిన లేఖ ఎలా బయటకు వచ్చిందో వారే సమాధానం చెప్పాలి. తండ్రి అయినా లీక్ చేయాలి లేదా కవిత లీక్ చేయాలి.. లేదా ఆమె అన్న, భావ అయినా లీక్ చేసి ఉండాలి. కవిత ను ఎప్పటికీ మేం బీజేపీలోకి తీసుకోమని డీకే అరుణ అన్నారు.

## ట్రంప్.. మరో షాక్...

లేఖ వ్రాస్తున్నాను, ఇది వెంటనే అమలులోకి వస్తుంది" అని నోయెమ్ లేఖలో రాశారు.హార్వర్డ్ అధికారిక రికార్డుల ప్రకారం, ప్రతి సంవత్సరం 500 నుండి 800 మంది భారతీయ విద్యార్థులు ఇక్కడ ప్రవేశం పొందుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచం నలుమూలల నుండి దాదాపు 6,800 మంది విద్యార్థులు ఇక్కడికి వస్తారు. ఈ సంవత్సరం 788 మంది భారతీయ విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇప్పుడు అలాంటి పరిస్థితిలో, ఈ విద్యార్థుల సమస్యలు పెరగబోతున్నాయి. విదేశీ విద్యార్థులు వేరే సంస్థలో అడ్మిషన్ తీసుకోవాలని లేదా అమెరికాలో వారి చట్టపరమైన హోదాను కోల్పోవాలని కోరారు. అందువల్ల, భారతీయ విద్యార్థులు మరొక సంస్థలో ప్రవేశం పొందే అవకాశం ఉంటుంది. వారు అలా చేయకపోతే, వారు అమెరికా వదిలి వెళ్ళవలసి రావచ్చు.హార్వర్డ్‌లో ప్రస్తుత సెమిస్టర్ పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రం ఒక ఉపశమన వార్త. వారు తమ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగలుగుతారు. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం కార్యదర్శి క్రిస్టి నోయెమ్ తన లేఖలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం చేసిన మార్పు 202526 విద్యా సంవత్సరం నుండి అమలు చేయడం జరుగుతుందని ఆయన రాశారు.డొనాల్డ్ ట్రంప్‌హార్వర్డ్ మధ్య వివాదం నెలకొంది. ట్రంప్ పరిపాలన తన సొంత కోరికల ప్రకారం విశ్వవిద్యాలయాన్ని నడపాలని కోరుకుంటుంది. కానీ హార్వర్డ్ దీనికి పూర్తిగా సిద్ధంగా లేదు. యూదులపై ద్వేషాన్ని ఆపడంలో హార్వర్డ్ విఫలమైందని ట్రంప్ ఆరోపించారు. యూదు విద్యార్థులు, ప్రొఫెసర్లపై వివక్ష ఉందని ట్రంప్ సర్కార్ ఆరోపించింది. ఇప్పుడు విదేశీ విద్యార్థుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విశ్వవిద్యాలయంపై పెరుగుతున్న ఒత్తిడి ఇదే అనిపిస్తుందంటున్నారు నిపుణులు.

# కరోనా కలకలం...

కరోనా కొత్త వేరియంట్ నిజంగానే అంత భయానకమా..? మళ్లీ క్వారెంటైన్ కష్టాలు తప్పవా..? పరిస్థితి లాక్‌డౌన్‌కు దారితీస్తుందా? అనే భయాల కంటే ముందుగా గుర్తొచ్చేది కొవిడ్ బూస్టర్ వ్యాక్సిన్. కానీ.. బూస్టర్ వెయ్యించుకోవాలా వద్దా అనేది కూడా ఇప్పుడు ప్రపంచ సమస్యగా మారింది. ఔను.. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో గుండెపోటు వచ్చే ఛాన్సుందట.



ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన పీడకల కొవిడ్ 19.. నేను బతికే ఉన్నా అంటూ అడపాదడపా హెచ్చరిస్తూనే ఉంది. వారం రోజులుగా ఆసియన్ కంట్రీస్‌లో టెర్రర్ పుట్టిస్తోంది. మనదాకా రాలేదుగా అనుకుంటుండగానే భారత్‌లో పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతూ..కొవిడ్ భయాన్ని మళ్లీ పరిచయం చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోమళ్లీ కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. మొన్నటికిమొన్న ఏపీలోని విశాఖపట్నంలో కరోనా కేసు బయటపడింది. తాజాగా తెలంగాణలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఓ వైద్యుడికి కొవిడ్ పాజిటివ్ వచ్చిందనే విషయం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో కొవిడ్ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ దశాబ్దం ఆరంభంలో వచ్చిన కొవిడ్ మహమ్మారి యావత్ దేశాన్ని గడగడలాడించింది. భారతప్రభుత్వం రెండుసార్లు దేశమంతా లాక్‌డౌన్ ప్రకటించాల్సి వచ్చింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. చైనాలోకి వూహాన్ నగరంలో పుట్టిన ఈ వైరస్ ప్రపంచ దేశాలన్నింటినీ చుట్టివచ్చింది. లక్షల్లో కరోనా కేసులు నమోదు కావడం, వేలాల్లో మరణాలు సంభవించడం చరిత్రలో ఓ భయానక అనుభవం. ఇక మహమ్మారి వెళ్లిపోయిందనుకున్న నాలుగేళ్ల తర్వాత మళ్లీ కొవిడ్ కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైందికొన్నిరోజుల నుంచి హాంకాంగ్, సింగపూర్ దేశాల్లోని పలు నగరాల్లో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. వారంతా రోగనిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు, నాడు కరోనా టీకా తీసుకోనివారు, వయోవృద్ధులేనని తెలిసింది. గతంలో వెలుగు చూసిన వేరియంట్లు కాకుండా, మళ్లీ కొత్త వేరియంట్లు ప్రబలుతండవచ్చనే అభిప్రాయం వైద్యనిపుణుల నుంచి వ్యక్తమవుతున్నది.గత వారం సింగపూర్‌లో ఏకంగా 14,200 కరోనా కేసులు నమోదు అయ్యాయని, వీటి సంఖ్య ఇంకా పెరుగుతూ వస్తుందని అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలను ప్రచురిస్తున్నాయి. అక్కడ రోజుకు సగటున 133 కేసులు నమోదవుతున్నాయనేది వార్తల సారాంశం. అలాగే హాంకాంగ్‌లోనూ కరోనా కేసులు కలకలం రేపుతున్నాయి. గత వారంలో 1,402 కేసులు నమోదయ్యాయని, అంతకు ముందు వారంతో పోలిస్తే.. ఆ సంఖ్య 13.66 శాతం పెరిగిందని సమాచారం. 81 మంది ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉందని తెలిసింది. మరణాలు కూడా పదుల సంఖ్యలో సంభవించాయని తెలియవచ్చింది.

> ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర కోవిడ్ సంబంధిత సమస్యలతో ఇద్దరు మరణించారు. వీళ్లకు మిగతా అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో అప్పట్లో తేలిగ్గా తీసుకున్నాయి ప్రభుత్వాలు. ఇప్పుడు కూడా మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు. ఎందుకంటే.. ఒక్క హాంకాంగ్‌లోనే 30మందికి పైగా చనిపోయారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నుంచే కొవిడ్ టెర్రర్ ఉంది. ఒక్క బ్యాంకాక్‌లోనే ఆరువేల కేసులు నమోదయ్యాయి.

కొవిడ్ బాధితులకు వచ్చిన రుగ్మతలను బట్టి నేడు విస్తరిస్తున్న కరోనా జేఎన్1 వేరియంట్‌కు చెందిందని వినవస్తున్నది. మే మూడ వ వారంలో భారత్‌లోని ముంబై, చెన్నై, అహ్మదాబాద్ వంటి నగరాల్లో కరోనా కేసులు నమోదు కావడం ఆందోళన రేపుతున్నది. ముంబైలో 95 కేసులు, అహ్మదాబాద్‌లో ఏడు కేసులు నమోదయ్యాయని గణాంకాలు చెప్తున్నాయి. రాష్ట్రాల పరంగా చూస్తే తమిళనా డు లో 34 కేసులు, కేరళలో 69 కేసులు, మహారాష్ట్రలో 44, కర్ణాటకలో 16 కేసులు, గుజరాత్‌లో ౮, ఢిల్లీలో ౩ కేసులు బయటపడ్డాయి. మొత్తంగా దేశవ్యాప్తంగా 257 కొత్త కొవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.భారత్‌లో కొవిడ్ ప్రభావం చాలా తక్కువగా ఉందని, ప్రజలెవరూ భయపడాల్సిన పని లేదని విజ్ఞప్తి చేస్తున్నా రు. కాకపోతే శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడే వృద్ధులు కాస్త అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వారు తరుచూ చేతులను శుభ్రం చేసుకోవాలని, బయటకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించడం ఉత్తమమని చెప్తున్నారు.

ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర కోవిడ్ సంబంధిత సమస్యలతో ఇద్దరు మరణించారు. వీళ్లకు మిగతా అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో అప్పట్లో తేలిగ్గా తీసుకున్నాయి ప్రభుత్వాలు. ఇప్పుడు కూడా మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు. ఎందుకంటే.. ఒక్క హాంకాంగ్‌లోనే 30మందికి పైగా చనిపోయారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నుంచే కొవిడ్ టెర్రర్ ఉంది. ఒక్క బ్యాంకాక్‌లోనే ఆరువేల కేసులు నమోదయ్యాయి. మన దేశపు జనాభాతో పోలిస్తే ప్రస్తుతమున్న కేసుల సంఖ్య చాలా తక్కువ. అంతమాత్రాన కరోనా ఉనికి లేదని ఊపిరి పీల్చుకోడానికి లేదు. ఎందుకంటే.. టెస్టుల సంఖ్యను బట్టే కేసుల సంఖ్య ఆధారపడి ఉంటుంది. కొవిడ్ సంకేతాలు కనిపించగానే టెస్టుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఇంకా మన దేశంలో లేదు.ఇప్పుడు సర్క్యులేషన్‌లో ఉన్న వైరస్.. ఒమిక్రాన్ ఫ్యామిలీలోని జేఎన్1 అనే వేరియంట్ నుంచి వచ్చిన సబ్‌వేరియంట్. ఒరిజినల్ వైరస్‌తో పోలిస్తే, దీని తీవ్రత చాలాచాలా తక్కువ. థర్డ్ వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ వేరియంటే అప్పట్లో పెద్దగా ప్రభావం చూపలేదు. తాజా వేరియంట్‌తో పెద్దగా భయపడాల్సిన అవసరం లేనట్టే..! 100 మందికి వైరస్ సోకితే ఐదుగురు కూడా ఆస్పత్రిలో చేరే అవసరం రాదు. కానీ.. కొవిడ్ ఉనికి తీవ్రతను బట్టి దేశాలన్నీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నదీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్. అందుబాటులో ఉన్నంత మాత్రాన బూస్టర్ వ్యాక్సిన్ వేసుకోవచ్చా..? అనేది కొత్తగా పుట్టిన భయం.ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ FDA.. కొవిడ్ వ్యాక్సిన్ రెగ్యులేషన్స్‌ని మార్చేసింది. 65 ఏళ్లు పైబడిన వాళ్లు మాత్రమే బూస్టర్ షాట్స్ తీసుకోడానికి అర్హులని తేల్చింది. ఇంతకంటే భయపెట్టే విషయం ఏంటంటే.. వ్యాక్సినేషన్ తర్వాత గుండెసంబంధిత వ్యాధులు రావొచ్చని హెచ్చరిస్తోంది FDA. ఈ మేరకు లేబుల్ మీద వార్నింగ్ ఇవ్వాలని వ్యాక్సిన్ తయారీ కంపెనీలను ఆదేశించింది కూడా. సో.. బూస్టర్ వ్యాక్సిన్ వేసుకుందాం.. కొవిడ్ బారిన పడకుండా తప్పించుకుందాం అని ఆశపడితే గుండెపోటుకు దొరికిపోయే ఛాన్సు ఉంది. తస్మాత్ జాగ్రత్త..!

## కరోనా కొత్త వేరియంట్

కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ పేర్కొన్నారు. ఈ వైరస్ గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి.. కానీ ఇది కోవిడ్ కొత్త వేరియంట్ కాదు. ఇది దాదాపు ఏడాదిన్నర క్రితం గుర్తించిన పాత వేరియంట్.. ఇది ఓమిక్రాన్ సబ్ వేరియంట్.. దీని గురించి భయపడాల్సిన అవసరం లేదు.. కానీ, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం.. ముఖ్యంగా రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే ఈ వ్యక్తులు వైరస్ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.. అని చెప్పారు.JN.1 వేరియంట్ అన్ని లక్షణాలు మునుపటిలాగే ఉన్నాయని.. దగ్గు, జలుబు, తలనొప్పి, తేలికపాటి జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తాయని డాక్టర్ సంజయ్ రాయ్ వివరించారు. రోగులలో శ్వాసకోశ సమస్యలు కనిపించడం లేదు. కరోనా ఒక వైరస్ అని.. వైరస్లు ఎప్పటికీ పూర్తిగా పోవు అని డాక్టర్ రాయ్ పేర్కొన్నారు. వైరస్ ఎప్పటికప్పుడు కనిపిస్తూనే ఉంటుందన్నారు.. వైరస్ తనను తాను సజీవంగా ఉంచుకోవడానికి పరివర్తన చెందుతూనే ఉంటుంది. ఈ క్రమంలో కొత్త వైవిధ్యాలు కూడా వస్తూనే ఉంటాయన్నారు. కానీ జె.ఎన్. 1 కొత్తది కాదు. ఇది పాత వ్యాధి.. దాని లక్షణాలు కూడా తేలికపాటివి. కోవిడ్ కేసులు పెరుగుతున్నప్పటికీ, లక్షణాలలో గణనీయమైన తేడా లేదని డాక్టర్ వివరించారుమునుపటిలాగా ఇప్పుడు కోవిడ్ నుండి తీవ్రమైన ప్రమాదం లేదని డాక్టర్ రాయ్ చెప్పారు. కొన్ని కేసులు వస్తూనే ఉంటాయి, కానీ వైరస్ వల్ల పెద్దగా ప్రమాదం ఉండదన్నారు. అయితే, ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.. ప్రత్యేకించి రద్దీగా ఉండే ప్రాంతాల్లో తమను తాము జాగ్రత్తగా చూసుకోవాలంటూ సూచించారు.

## టీమిండియాకు ఎదురే లేదు



ఉండాలని ప్రధాని మోదీ అన్నారు. ఒక రాష్ట్రం: ఒక ప్రపంచ గమ్యస్థానం విధానం పర్యాటకాన్ని పెంచడమే కాకుండా సమీప నగరాల అభివృద్ధికి కూడా దారితీస్తుందన్నారు. భారతదేశం పట్టణీకరణ వైపు వేగంగా కదులుతోంది. భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న నగరాల కోసం మనం కృషి చేయాలి. వృద్ధి, ఆవిష్కరణ, స్థిరత్వం మన నగరాల చోదక శక్తిగా మారాలని ప్రధాని మోదీ అన్నారు.అందరి కళ్ళు నీతి ఆయోగ్ సమావేశంపైనే ఉన్నాయి. ప్రధాని మోదీ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో బీహార్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాలేదు.. ఆపరేషన్ సింధూర్ తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధానమంత్రి నిర్వహిస్తున్న మొదటి ప్రధాన సమావేశం ఇది. సాధారణంగా, పూర్తి కౌన్సిల్ సమావేశం ప్రతి సంవత్సరం జరుగుతుంది. గత సంవత్సరం ఇది జూలై 27న జరిగింది.నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో స్వర్ణాంధ్రపై ప్రజెంటేషన్ ఇచ్చారు ఏపీ సీఎం చంద్రబాబు. రాష్ట్రంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు.

ఏపీ ప్రతిపాదనలను ఇతర రాష్ట్రాలు పరిశీలించాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ సూచించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని.. గూగుల్, AI టెక్నాలజీని వాడుతున్నామని తెలిపారు. 2029 నాటికి పేదరిక నిర్మూలనే తమ లక్ష్యమన్నారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌పై పలువురు ప్రశంసలు కురిపించారు.

**చంద్రబాబు..గ్రేట్**

కేంద్ర పెద్దల వద్ద ఏపీ సీఎం చంద్రబాబుకు గుర్తింపు కొనసాగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కూడా పెరిగింది. ఎన్డీఏలో టిడిపి కీలక భాగస్వామిగా మారింది. ఏపీ నుంచి రాజకీయంగా రాజ్యసభ ఇతరత్రా పదవుల్లో బిజెపికి కూడా ప్రాధాన్యం ఇస్తోంది టిడిపి కూటమి. పరస్పర సహకారంతో కూటమి పార్టీలు ముందుకు సాగుతున్నాయి. గత అనుభవాల దృష్ట్యా కేంద్ర పెద్దలతో చంద్రబాబు సఖ్యతగా మెలుగుతున్నారు.

ఈ క్రమంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పరస్పరం ప్రశంసలు కురిపించుకుంటున్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో సైతం ఆ ఇరువురి నేతలు పరస్పరం గౌరవించుకున్నారు. ముఖ్యంగా చంద్రబాబు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు ప్రధాని మోదీ ముగ్ధుడయ్యారు. తన మనసులో ఉన్న మాటలు బయట పెట్టారు. ఏపీ సీఎం చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలని మిగతా ముఖ్యమంత్రులకు సూచించారు.నీతి ఆయోగ్ భేటీలో ఏపీకి సహకారం అందించాలని ప్రధాని మోదీతో పాటు కేంద్ర పెద్దలకు విజ్ఞప్తి చేశారు ఏపీ సీఎం చంద్రబాబు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను అభివృద్ధి చేస్తున్నామని.. ఇందులో భాగంగా నాలుగు జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే మోడల్ ను అమరావతి, కర్నూలు, తిరుపతికి కూడా విస్తరించేలా కేంద్రం సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు చంద్రబాబు. డిజిటల్ పాలనను అమలు చేస్తున్నామని.. ఇందులో భాగంగా ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ పాస్ బుక్ కూడా ఇస్తామన్నారు. చంద్రబాబు ప్రజెంటేషన్ పూర్తిగా విన్న ప్రధాని మోదీ.. వికసిత్ భారత్ కోసం చంద్రబాబు ఇచ్చిన సూచనలను తప్పకుండా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన సూచనలను ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించాలని ప్రధాని మోదీ సూచించారు. చంద్రబాబు సూచనలు వికసిత్ భారత్ కు ఉపయోగపడేలా ఉన్నాయని కితాబిచ్చారు. ప్రధాని మోదీ తో పాటు ఈ భేటీకి హాజరైన ఇతర వ్యక్తులు కూడా చంద్రబాబు సూచనలను స్వాగతించారు. చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

# ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ మండల కేంద్రం లోని ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం జడ్పి హెచ్ ఎస్ ఉప్పల్ కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం ముఖ్యఅతిథిగా హాజరై మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తిపరమైన శిక్షణను అందుకొని మన ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల యొక్క భవిష్యత్తుకు తన వంతుగా ఎలాంటి సహాయమైనా ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చే పేద విద్యార్థులకు వారి తల్లి దండ్రుల ఆరోగ్య విషయాల పట్ల ఏ విషయానికైనా సహాయం అందించడానికి ముందుంటానని తెలియజేశారు. ఎవరైనా పేద విద్యార్థులు ఎంబిబిఎస్ చదువుకోవాలని తన వద్దకు వస్తే వారికి ఆర్థిక సహాయం అందిస్తానని ప్రభుత్వ పాఠశాలలు మన మండలంలో ఏ పాఠశాలకి ఏ అవసరం వచ్చినా మౌలిక వసతులు తీర్చడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని వివిధ పాఠశాలల అభివృద్ధికి విద్యాశాఖ అధికారుల తోటి కూడా తరచుగా సంప్రదించడం జరుగుతుందని తెలియజేశారు అలాగే మండలంలోని కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి విద్యా వాలంటీర్లను కూడా అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఉపాధ్యాయులు వేసవి సెలవులలో కూడా సొంత అవసరాలను మానుకొని విద్యార్థులకు మంచి విద్యను అందించడం కోసం ఇలా వేసవిలో కూడా శిక్షణను తీసుకుంటున్నందుకు ఉపాధ్యాయులందరినీ అభినందించడం జరిగింది. మీరు రేపు నేర్చుకున్న అంశాలన్నింటినీ మన పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి యొక్క భవిష్యత్తుకు పునాదులు వేస్తారని ఆశిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలలకు ఎమ్మెల్యే తన యొక్క సహాయం సహకారాల అందించడానికి ముందుకు వచ్చినందుకు వారికి మండల విద్యాశాఖ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ కార్యక్రమానికి విచ్చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు రిసోర్స్ పర్సన్లు పాల్గొనడం జరిగింది.



## మూడేళ్ల బాలిక పై అత్యాచారం, హత్య ఘటన

■ జిల్లా ఎస్పీ జీవి అశోక్ కుమార్ సీరియస్

**జయభేరి, బ్రహ్మంగారిమఠం (మైదుకూరు):**

అభము శుభము తెలియని ఓ చిన్నారి మూడేళ్ల బాలికపై ఓ అభాగ్యుడు అత్యాచారం చేసి ఆ తర్వాత హత్య చేసిన ఘటనపై కడప జిల్లా ఎస్పీ జి.వి అశోక్ కుమార్ సీరియస్ అయ్యారు శనివారం ఉదయం జమ్మలమడుగు పట్టణం లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించి నిందితుడిని అరెస్టు చేసి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని బాధిత తల్లి దండ్రులకు జిల్లా ఎస్పీ ఇ జి అశోక కుమార్ భరోసా కల్పించారు. అనంతరం తలమంచి పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని కంబాల దిన్నె గ్రామంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు పురోగతి పై దర్యాప్తు అధికారి, జమ్మలమడుగు డి.ఎస్పీ వెంకటేశ్వర రావు ను వివరాలు ఎస్పీ అడిగి తెలుసుకున్నారు మహిళలు, చిన్నారుల పై అఘాయిత్యాల కు పాల్పడేవారి పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరిక చేశారు. జిల్లా ఎస్పీ వెంట జమ్మలమడుగు డి.ఎస్పీ వెంకటేశ్వర రావు, జమ్మలమడుగు రూరల్ సి.ఐ గోపాల్ రెడ్డి, అర్బన్ సి.ఐ లింగప్ప, సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కుర్చీతో దాడి చేసిన శ్రీనుపై కేసు

**జయభేరి, హయత్ నగర్ :**

శనివారం ఉదయం 7.30 గంటలకు సంపత్ నిఖిత (32), తండ్రి రామచంద్ర, ప్రాంతం భిక్షాటన (ట్రాన్స్‌జెండర్), కులం ఎస్టీయెరుకుల, వివేకానంద విగ్రహం దగ్గర, చర్చి రోడ్డు, కుంట్లూరు, అబ్దుల్లాపూర్‌మెట్, శ్రీను (25), తండ్రి మైసయ్య, కులం యెరుకుల, కార్మికుడు, ఆర్.ఆర్. జిల్లా, మన్సూరాబాద్‌లో నివసిస్తున్న వ్యక్తితో గత నాలుగు సంవత్సరాలుగా సహజీవనం చేస్తోంది. అయితే అతని దుర్వినియోగ ప్రవర్తన కారణంగా, ఆమె గత 10 నెలలుగా అతని నుండి విడిగా నివసిస్తోంది. అయితే, శుక్రవారం రాత్రి 1:30 గంటలకు శ్రీను ఆమె ఇంటికి తిరిగి వచ్చి మాట, మాట పెరిగి కుర్చీతో ఆమెపై దాడి చేసి, రాయితో కిటికీ అద్దం పగలగొట్టి ఆమె స్కూటీకి నిప్పంటించి అక్కడి నుండి పారిపోయాడు. ఈ చర్యలకు శ్రీనుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారురాలు యొక్క పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి SHO హయత్‌నగర్ పోలీస్లు దర్యాప్తు జరుగుతోంది.

## ఇక మైసూర్ పాక్ కాదు.. శ్రీ

**జయభేరి, హైదరాబాద్, మే 24:**

పహల్‌గామ్ ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై భారత ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోవైపు భారతదేశంపాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో కొందరు మైసూర్‌పాక్ పేరును మార్చాలని సూచించారు. దాంతో జైపూర్‌లోని ప్రముఖ త్యోహార్ స్వీట్స్ యజమాని వెంటనే స్పందించారు. తన దుకాణంలో మైసూర్ పాక్ స్వీట్ పేరులోని 'పాక్' పదాన్ని తొలగించి 'మైసూర్ శ్రీ'గా పేరు మార్చారు. దేశంపై భక్తి భావంతో తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు నెటిజన్లు.షాప్ యజమాని అంజలి జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరి మెనూలోని మైసూరు పాక్ ఇకపై మైసూరు శ్రీగా, మోతీ పాక్‌మోతీ శ్రీగా, ఆమ్ పాక్‌ఆమ్ శ్రీగా, గోండ్ పాక్‌గోండ్ శ్రీగా, స్వర్ణ భస్మ పాక్‌స్వర్ణ భస్మ శ్రీగా, చందీ భస్మ పాక్‌చందీ భస్మ శ్రీగా పేరు మార్చబడ్డాయి. అయితే "పాక్" అనే పదం కన్నడలో చక్కెర సిరప్‌ను సూచిస్తుంది.

## బండారి రాజిరెడ్డి బాటలో నడుస్తా..

■ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



నిబద్ధత కలిగిన నాయకుడు తన సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డిని కోల్పోవడం బాధాకరం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం వేంకటేశ్వర నగర్ మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని సాయి బాబా దేవాలయం లో ట్రస్ట్ బోర్డ్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సంతాప సభలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.

అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన సోదరుడు దివంగత నేత బండారి రాజిరెడ్డి ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివి అని ఆయన అన్నారు.

తను కూడా తన సోదరుని బాటలో నడుస్తూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు జంపాల్ రెడ్డి, నాదం చారి ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, BRS పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ టీటీడీ కళ్యాణ మండపం నుండి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్దకు ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తాటిశెట్టి సుదర్శన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీ శ్రీ శ్రీ ఆదిత్య పరా శ్రీ స్వామీజీ విచ్చేయుచున్నట్టు తెలిపారు. గత నెల 22వ తేదీన పహెలగామ్ లో అమాయక హిందూ పర్యాటకులను మట్టుపెట్టిన పాకిస్తాన్ నరహంతక తీవ్రవాదులను తుద ముట్టించడంలో పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించి ఉగ్రవాదులను అంతముందుంచి యావత్ భారతదేశానికి ఒక భరోసా కల్పించిన సైనికులకు భరోసాగా పార్టీలకు కుల మతాలకు అతీతంగా అందరూ ఈ యొక్క ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దేవరకొం సమావేశం నిర్వహించడం జరిగింది ఈ యొక్క సమావేశంలో ఏటీ కృష్ణ, కర్నాటి సురేష్, చెనముని రాములు, వానం నరేందర్ రెడ్డి, అంకూరి నరసింహ, వసుకుల సుధాకర్, గుండాలఅంజయ్య,రెడ్డి శంకర్, నాగేంద్ర, బిక్కు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కేటీఆర్ మర్చిపోయారు

■ మంత్రి సీతక్క

**జయభేరి, హైదరాబాద్ :**



పంచాయతీ గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సచివాలయం లో మీడియా తో మాట్లాడారు. సిస్టర్ స్ట్రోక్ తో కేటీఆర్ కు చిన్న మెదడు చితికిపోయింది. కాళేశ్వరం లో కమీషన్ తీసుకున్నప్పుడు లేని భయం.. కమీషన్ ముందు కు రావడానికి ఎందుకని అడిగారు. గ్లోబెల్స్ ప్రచారం లో నిన్ను మించిన వారు లేరు... కేటీఆర్.. నీకు గ్లోబెల్ అవార్డు ఇవ్వాలి. అబద్దాల పునాదుల పై బిఆర్ఎస్ నడుస్తుంది. గోబెల్స్ ను కేటీఆర్ మించిపోయాడు. కవిత అన్న దెయ్యం కేటీఆరే కావొచ్చు.. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్ కు లేదు. కాళేశ్వరం కూలిపోయినప్పుడు అధికారం లో ఉంది బిఆర్ఎస్ కాదా... మోడీ ప్రశంసల కోసమే... ఈడీ గురించి కేటీఆర్ మాట్లాడుతున్నాడు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు గా ఉన్నప్పుడు ఈ కేసు బుక్ చేసారు. యుద్ధం లో ట్రంప్ నీతి ని అమలు చేస్తున్నారు మోడీ.. అబద్ధాన్ని నిజం చేయడం కోసం కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర ను కేటీఆర్ మర్చిపోయారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి పై తప్పుడు విమర్శలు మానుకో.. నీకు నీతి నిజాయితీ ఉంటే కాళేశ్వరం కూలేశ్వరం అయిందో చెప్పు.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన పత్రికకు సహాయం చేస్తే తప్పా.. గులాబీ కూలీల రూపంలో దోచుకున్న డబ్బు ఎక్కడదో సమాధానం చెప్పమని అన్నారు.




## భూగర్భ డ్రైనేజీ.. రోడ్డు కూడా మంజూరు

**జయభేరి, ఉప్పల్ :**

రాఘవేంద్ర నగర్ అల్ అక్సా మసీదు రోడ్డు అలాగే చర్చ్ రోడ్డులో కొత్తగా 35 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తో కలిసి పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక బస్తివాసులు చాలాకాలంగా పరిష్కారం గానీ భూగర్భ డ్రైనేజీ మస్యను అలాగే మంచినీటి సమస్యలను పరిష్కరించి రోడ్డు కూడా మంజూరు చేయించినందుకు కృతజ్ఞతగా కార్పొరేటర్కు, ఎమ్మెల్యేకి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మల్లేష్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, ప్రీతి రెడ్డి, యాదగిరి, రాజబాబు, రామ్ చందర్, గణేష్, సుగుణాకర్ రావు, అజ్మీరి శ్రీనివాస్, సంపత్ యాదవ్, జయరాజ్, OBED FAIZ చంద్రశేఖర్, హరి ప్రసాద్ కుమార్, యాకి, అలక్స మసీదు పెద్దలు బస్తీ వాసు, DE బాలకృష్ణ, AE కీర్తి, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జయభేరి, కాప్రా :**

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని భక్షిగూడ, కృష్ణనగర్ కాలనీలలో 33 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే, డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్, కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, బాలయ్య గౌడ్, చారి, అంజయ్య గౌడ్, నవీన్ గౌడ్, అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, రత్నమాల, ఎల్లప్ప, మరియు బీఆర్ఎస్ నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, నిసార్ అహ్మద్ గోరి, కిరణ్ మరియు కాలనీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## ముంపునకు గురికాకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు

■ GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

మన్సూరాబాద్ డివిజన్, శ్రీ గణేష్ నగర్ కాలనీ ఫేస్ 1 లో కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి సీ.సీ రోడ్డు అభివృద్ధి పనులను, స్థానిక సమస్యల పై కాలనీలో పర్యటించి సంక్షేమ సభ్యులను అడిగి తెలుసుకొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా పనామా పైన ఉన్న కాలనీల వర్షపు నీరు గణేష్ నగర్ కాలనీ ఫేస్ 1లోకి నేరుగా వస్తుండేదని ముంపు సమస్య పరిష్కారంలో భాగంగా వర్షపు నీరు నిలవకుండా ప్రత్యేకంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ లైన్ నిర్మించడం జరిగిందని తెలిపారు. గణేష్ నగర్ కాలనీ ఫేస్ 1 నుండి ప్రత్యేకంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్ మల్లికార్జున్ నగర్ కాలనీ కమాన్ లోపలి నుండి సుబ్బయ్య హోటల్ వెనుక ఉన్న బాక్స్ డ్రైన్ నాలాకు అప్పటి జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి ప్రత్యేక చొరవతో R&B, HMWS &SB, GHMC శాఖల అధికారులను సమన్వయం చేసి ఇట్టి పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. గణేష్ నగర్ ఫేస్ 1 కాలనీలో వేస్తున్న సీ.సీ రోడ్డు అభివృద్ధి పనులను పర్యవేక్షించి అట్టి రోడ్డు గుత్తేదారును 20 ఫీట్ల వెడల్పు వేయాలని కోరారు అనంతరం కాలనీలో డ్రైయినేజీ సమస్య ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సత్యనారాయణ, సతీష్ చంద్, శ్రీను ప్రకాష్, మదన్మోహన్ సుధాకర్, నాగేష్, మురళీధర్, రఘుపతి, సిద్ధిరాజా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

**జయభేరి, అన్నమయ్య:**

ముదివేడు వద్ద గుర్తు తెలియని వాహణం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. శుక్రవారం అర్ధ రాత్రి కురబలకోట మండలం లో జరిగిన ఘటనపై ఎస్ఐ దిలీప్ కుమార్ కథనం.. పెద్దమండ్యం మండలం, ముసలికుంట గ్రామం, గోనుపోతుల పల్లెకు చెందిన సిద్ధమల్ నాయుని కొడుకు శేషప్ప (32) కువైట్ నుండి వారం క్రితం స్వగ్రామం వచ్చాడు. భార్య అపర్ణ తో కలసి నిన్నటి దినం మదనపల్లెలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో అత్తకు ఆపరేషన్ చేయించాడు. రాత్రి బైక్ లో ఇంటికి వెళుతుండగా, మార్గ మధ్యంలోని టోల్ ప్లాజా సమీపంలో గుర్తు తెలియని వాహణం ఢీకొని అక్కడి కక్కడే శేషప్ప మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది..

# అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇండ్లస్థలం ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలి

- పల్లా నర్సింహా రెడ్డి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇండ్లస్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పలా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం నాడు దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్లో జరిగిన దేవరకొండ పట్టణ 14వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో అర్హుల లిస్టులో పేరు ఉన్నప్పటికీ సొంత స్థలం లేకపోవడంతో అనర్హులుగా మారుతున్న నిరుపేదలు వారికి ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వలన అసంపూర్తిగా గుంతలమయంగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని సంవత్సరాలు గడుస్తున్న శిలాఫలకాలకే పరిమితమైన రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని .ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా గత వంద సంవత్సరాలుగా సిపిఐ ప్రయాణిస్తుందని ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విదంగా మళ్ళీ సిలిండర్ ధర పెంచడం అన్యాయమని అన్నారు. పండించిన పంట కు గిట్టుబాటు ధర మరియు, రాబోయే వానకాల పంటలకు ఎరువులు విత్తనాలు సబ్సిడి మీద ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. ఈసభ వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ మాసభలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, మాజీ ఎంపీపీ పల్లా సులోచన,పట్టణ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు,మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి లింగంపల్లి అనిత, పట్టణ సహాయ కార్యదర్శి తోటపల్లి నగేష్, శాఖ కార్యదర్శిలు జూలూరి జ్యోతి బస్ లింగంపల్లి వెంకటయ్య అలమోని మల్లయ్య ఏషామోని మల్లేష్ కందుకూరి శ్రీను ఎండి మైనుద్దీన్ నీల వెంకటయ్య పర్వతం వెంకటాద్రి, నాయకులు రేణిగుంట శ్రీనివాస్, నీలా అనసూయ జక్కా కృష్ణారెడ్డి, పుప్పాల గిరి, రాజ మల్లయ్య, ఎండి జాకీర్ కొండోజు ఆనందచారి మహేశ్వరం బ్రహ్మాచారి బొడ్డుపల్లి గెల్వయ్య, కొండ్రెడ్డి రమేష్, గోరటి శ్రీను వలమల బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



## నూతన సిసి రోడ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్

**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ డివిజన్లోని అరుణోదయ కాలనీ రోడ్ no. 1లో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ ప్రారంభోత్సవంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు గత నాలుగున్నర సంవత్సరాలుగా హయత్ నగర్ డివిజన్ శరవేగంగా అభివృద్ధి చేయడం జరిగిందని రానున్న రోజుల్లో కూడా హయత్ నగర్ డివిజన్ మరింత అభివృద్ధి పరిచేలా కృషి చేస్తానని వారు కాలనీవాసులకి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ గ్రామ పెద్దలు కళ్లెం శంకర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు సామ రవీందర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు తుంగ నరసింహారెడ్డి, బద్దం గోపాల్ రెడ్డి, హనుమంతు రెడ్డి, గుమ్మడి సుధాకర్ రెడ్డి, సుదర్శన్, జగన్మోహన్ రెడ్డి, కృష్ణా రెడ్డి, రాములు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సర్వశక్తి స్వరూపిణి మాత ఆలయ ఉత్సవాలు ప్రారంభం



**జయభేరి, తుర్కపల్లి, మే 24 :**

తుర్కపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో శ్రీ సర్వ శక్తి స్వరూపిణి మాత ఆలయ 29వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం మేలుకొలుపు, సుప్రభాత సేవ, గ్రామదేవతల పూజా కార్యక్రమం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, హారతి, కలశ స్థాపన, మంట పారాధన ,హారతి, నిరాజన సేవ, భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈనెల 25న ఉదయం మేలుకొలుపు, స్థాపిత దేవత పూజలు, నవ శతి చండీ హోమం, అనంతరం మధ్యాహ్నం 11 గంటలకు శ్రీ సర్వ శక్తి స్వరూపిణి మాత, సర్వేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం, ఓడి బియ్యం సమర్పణ అనంతరం ఒగ్గు పూజారులచే ఊరేగింపు అమ్మ వారి పల్లకి సేవ, రాత్రి సాంస్కృతిక భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమాతా ధార్మిక సేవా సమితి ధర్మకర్త తొలిచుక్క మాధవి శ్యామ్ కుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## బొడ్రాయి, దుర్గమ్మ పండుగలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**జయభేరి, తుర్కపల్లి, మే 24 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో బొడ్రాయి, దుర్గమ్మ పండుగ వేడుకల్లో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిలో భాగంగా గ్రామ దేవతల పండుగలు చాలా ప్రత్యేకంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. గ్రామ ప్రజలపై దుర్గమ్మ తల్లి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని అందరూ సుఖసంతోషాలతో గడపాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనాపత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, నాయకులు ఎరుకల వెంకటేష్ గౌడ్, దేవరుప్పుల మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించిన మధు



**జయభేరి, తుర్కపల్లి, మే 24 :**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామపంచాయతీ కార్యదర్శిగా మధు కు గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్ శనివారం బాధ్యతలను అప్పగించారు. గత మూడున్నర సంవత్సరాలుగా వాసాలమర్రి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గా పనిచేసే బొమ్మలరామారం మండలం సోలిపేట గ్రామానికి బదిలీ కావడంతో తుర్కపల్లి మండలం కోనాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మధు వాసాలమర్రి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కారోబార్ పలుగుల ప్రశాంతి పాల్గొన్నారు.

## టీజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవాలను జయప్రదం చేయండి

- జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్

**జయభేరి, జవహర్ నగర్, మే24 :**



ఈనెల 31న టీజేఎఫ్ నిర్వహించే రజతోత్సవ వేడుకను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని జవహర్ నగర్ కార్పొరేషన్ స్థానిక ప్రెస్ క్లబ్ నాయకులు గుమ్మడివెల్లి సత్యానారాయణ. ఈగ నాగేంద్రబాబు, టీజెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రజతోత్సవ వేడుకల గోడ పత్రికను జర్నలిస్టులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31న టీజేఎఫ్ రజోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం తెలంగాణ రాష్ట్రం సాధించేంతవరకు 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించింది. తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ యూనియన్ కీలక పాత్ర పోషించింది. వివిధ రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ కీలక పాత్ర పోషించింది అని గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలు మరోసారి తెలియ చెప్పడానికి హైదరాబాద్ నెక్లెస్ రోడ్ లోని జలవిహార్ లో టీజేఎఫ్ రజతోత్సవాలు నిర్వహిస్తున్నారు.

కావున పెద్ద ఎత్తున జర్నలిస్టులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుమ్మడివెల్లి సత్యనారాయణ, ఈగ నాగేంద్రబాబు, పోరండ్ల గిరి సత్యనారాయణ, పెద్ది రమేష్, గౌరీ శంకర్, శంకరాచారి, సాగర్, వెంకటేష్, కుర్రోళ్ళ మధు, కాసుల నరేష్, గాదరి స్వామి, కుంచెలరాము, భవాని శంకర్, గంగాధర్ చారి, నరసింహ చారి, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## రంగంలోకి సర్వేయర్లు



**జయభేరి, కరీంనగర్, మే 24:**

తెలంగాణలో భూ భారతి చట్టం అమల్లోకి రావటంతో... కీలక మార్పులు రానున్నాయి. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేశారు. దీంతో సర్వేయర్లు కీలకంగా మారనున్నారు. ఈ నేపథ్యంలో తొలి విడత కింద 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకువచ్చేందుకు సర్కార్ సిద్ధమైంది.భూ భారతి చట్టం అమల్లోకి రావటంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కీలక మార్పులు రానున్నాయి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద పలు మండలాల్లో ఈ చట్టం ప్రకారమే సేవలు అందుబాటులో రాగా... త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో సేవలు ప్రారంభం కానున్నాయి. కొత్త చట్టం ప్రకారం... భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే సర్వే మ్యాప్ తప్పనిసరి. కాబట్టి....సర్వేయర్ల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా తెలంగాణ కసరత్తు చేస్తోంది.రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా తొలి విడత కింద ఐదు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోబోతున్నారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తి కాగా.... వీరందరికీ మే 26వ తేదీ నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లోనే శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.సర్వేయర్లకు ఎంపికైన వారికి రెండు నెలల పాటు వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తైన వెంటనే ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం, భూ లావాదేవీలను బట్టి ఆరు నుంచి ఎనిమిది మంది సర్వేయర్లను నియమించనున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ దగ్గర భూములకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు సర్వే పత్రాన్ని కూడా జత పరచాలని భూభారతి చట్టంలో పేర్కొనడం జరిగింది. ఇందుకు అనుగుణంగానే సర్వే విభాగాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని ,ఇప్పటివరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీసర్వే చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేశారు. ఈ ఐదు గ్రామాల్లో ముందుగా గ్రామ సభలు నిర్వహించి సర్వేకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. నెలరోజుల్లో ఈ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం.... అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సర్వే విజయవంతమైన తర్వాత... రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో సర్వేకు సిద్ధమయ్యే అవకాశం ఉంది.



## అన్ని జిల్లాల కాంట్రాక్టర్లు భారీ ధర్నా కార్యక్రమం చేపడతాం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనులు చేసి పెండింగ్ లో ఉన్న బిల్లు లు ఎస్ డిఎఫ్ సంబంధించిన 9,900 కోట్ల బిల్లులను గవర్నమెంట్ 21, 5, 25 రోజున బడ్జెట్ రిలీజ్ చేసినారు, ఒక్క పంచాయతీరాజ్ లో చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే రిలీజ్ చేశారు రాష్ట్రంలో ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్లో ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్లో మున్సిపాలిటీ లో సోషల్ వెల్ఫేర్ లో మన ఊరి మనబడి డిపార్ట్మెంట్లో నీటిపారుదల శాఖ ఐబి డిపార్ట్మెంట్లలో పనులు చేసి 15 నెలలు దాటింది. ఈ డిపార్ట్మెంట్ లకు ఒక్క పైసా కూడా తెలంగాణ గవర్నమెంట్ రిలీజ్ చేయలేదు. మరి మీరు ఎక్కడ పోవాలి. అప్పులు చేసి ప్రజల సౌకర్యార్థం కోసం పనులు చేశాం మరి మాకు కూడా బడ్జెట్ రిలీజ్ చేయాలని ఈనెల 30వ తేదీ లోపల అన్ని డిపార్ట్మెంట్లకు అందరి కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు గవర్నమెంట్ బడ్జెట్ రిలీజ్ చేస్తే అన్ని డిపార్ట్మెంట్ లకు అందరి కాంట్రాక్టర్లకు అన్ని డిపార్ట్మెంట్లకు బడ్జెట్ చేయాలి ఒక పంచాయతీరాజ్ మాత్రమే చేసినారు మరి మేమేం పాపం చేశాం. మేము లక్షలు పెట్టుబడి పెట్టాం 15 నెలలు దాటింది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు రావాల్సిన బిల్లులను రిలీజ్ చేయాలని ఈనెల 30వ తేదీ లోపల డిలీట్ చేయాలి చేయకపోతే ప్రగతి భవన్ ఈ ఎన్ సి చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ ముందు అన్ని జిల్లాల కాంట్రాక్టర్ల భారీ ధర్నా కార్యక్రమం చేపడతాం దయచేసి మా యొక్క బాధను గవర్నమెంట్ అర్థం చేసుకొని మమ్మల్ని ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కి, మంత్రివర్గ బృందానికి చీఫ్ ఇంజనీర్ కి విజ్ఞప్తి చేస్తున్నాము, అని సివిల్ కాంట్రాక్టర్ ఇరగ దిండ్ల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేసినారు.

## సోషల్ మీడియా అధ్యక్షుడు ఎన్నిక



**జయభేరి, వర్గల్, మే 24 :**

ఎన్ఎమ్ఆర్ వర్గల్ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు గా నవీన్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సోషల్ మీడియా అధ్యక్ష పదవి కట్టబెట్టిన ఎన్ఎమ్ఆర్ జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఝాన్సీరెడ్డి కు బిగిస్తున్న ఉచ్చు



**జయభేరి, వరంగల్, మే 24:**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలలో పాలకుర్తి నియోజకవర్గంలో పొందిన విషయం అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో ఎర్రబెల్లి దయాకర్ రావు వరుస విజయాలు సాధించుకుంటూ వస్తున్నారు. పైగా ఇక్కడ గెలిచిన తర్వాత ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. అయితే ఎర్రబల్లి దయాకర్ రావు ను ఓడించి యశస్విని రెడ్డి చరిత్ర సృష్టించారు. వాస్తవానికి ఆమె అత్త ఝాన్సీ రెడ్డి పోటీ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆమెకు ఉన్న వీసా, ఇతర ఇబ్బందుల వల్ల పోటీ చేయలేకపోయారు. అప్పటికప్పుడు తన కోడలిని పోటీలోకి దించారు. బలమైన దయాకర్ రావును ఓడించారు. ఓడించడం మాత్రమే కాకుండా.. పాలకుర్తి నియోజకవర్గం లో తన రాజకీయ ప్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే దయాకర్ రావు కంచుకోటల లాగా ఉన్న ప్రాంతాలలో స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో కొన్ని రకాల ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఝాన్సీ రెడ్డి - యశస్విని రెడ్డి దూసుకుపోతున్నారు. అయితే ఇప్పుడు ఝాన్సీ రెడ్డికి తెలంగాణ హైకోర్టు నోటీసులు ఇవ్వడంతో ఒకసారిగా పాలకుర్తిలో, తెలంగాణ రాష్ట్రంలో సంచలనం నెలకొంది. 2017లో ఝాన్సీ రెడ్డి, ఆమె భర్త రాజేందర్రెడ్డి తెలంగాణ రాష్ట్రంలోని తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో 75 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిని ఝాన్సీ రెడ్డి ఫెమా నిబంధనలను ఉల్లంఘించి కొనుగోలు చేశారని దామోదర్ రెడ్డి అనే వ్యక్తి అప్పట్లో ఆరోపణలు చేశారు. అంతేకాదు రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాడు నిబంధనలకు విరుద్ధంగా ఝాన్సీ రెడ్డికి అప్పటి రెవెన్యూ అధికారులు పాస్బుక్ మంజూరు చేశారని ఆరోపించారు. దానికి సంబంధించిన ఆధారాలను హైకోర్టుకు సమర్పించారు. అతడు సమర్పించిన ఆధారాలతో ఏకీభవించిన తెలంగాణ హైకోర్టు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీసీఎల్ఏ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కు నోటీసులు జారీ చేసింది. అయితే ఈ భూమి విషయంలో విచారణ మొత్తం పూర్తి చేసి.. నివేదిక అందించాలని ఈడి జాయింట్ డైరెక్టర్ కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 2017లో ఝాన్సీ రెడ్డి యాక్టివ్ పొలిటిషన్ కాదు. అప్పటికి ఆమె రాజకీయాల్లోకి రావాలి అని కూడా అనుకోలేదు. కాకపోతే ఓ ప్రజా ప్రతినిధిని పూర్తిస్థాయిలో నమ్మారని.. అతడి వ్యవహార శైలి నచ్చకపోవడంతో.. నేరుగా ఝాన్సీ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని.. తనకు నిబంధనలు అడ్డుగా ఉండడంతో కోడల్ని ఎమ్మెల్యేగా పోటీలో ఉంచారని.. నువ్వా నేనా అన్నట్టుగా సాగిన పోటీలో గెలిపించుకున్నారని పాలకుర్తి నియోజకవర్గం లో ఇప్పటికీ ప్రచారం జరుగుతోంది. అయితే ఝాన్సీ రెడ్డి పై అక్కసు తోనే దామోదర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించాడని కాంగ్రెస్ నాయకుల ఆరోపిస్తున్నారు. దామోదర్ రెడ్డి వెనుక ఓ బలమైన నాయకుడు ఉన్నారని విమర్శిస్తున్నారు. ఝాన్సీ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించలేదని.. అంతా న్యాయబద్ధంగానే భూములు కొనుగోలు చేశారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. అయితే ఈ భూ వ్యవహారం ఎటు దారితీస్తుందో చూడాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.




## బెండే మధును పరామర్శించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, మే 24 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెండే మధు ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సందర్భంగా బెండే మధు ను వారి స్వగృహం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెండే మధు మంచిగా ఆరోగ్యం చూసుకోవాలని, సమయానికి మందులు తీసుకుని ఆరోగ్యం మంచిగా చూసుకోవాలని అన్నారు.

## నవీన్ కుమార్ ని అభినందించిన జాలే



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని బుడ్డోనితండ గ్రామానికీ చెందిన శ్రీమతి శ్రీ రమావత్ పద్మ గోదారి నాయక్ కుమారుడు నవీన్ కుమార్ కేంద్ర ప్రభుత్వనికి సంబంధించిన భారత్ ఎలక్ట్రానిక్స్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగం సాధించిన సందర్భంగా నవీన్ కుమార్ ని అభినందించి శుభాకాంక్షలు తెలిపిన జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ఒక మారుమూల ప్రాంతంలో జన్మించి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగం సాధించిన నవీన్ కుమార్ ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు అదే విధంగా యువత ముఖ్యంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువులో రాణించి ఉన్నత స్థానానికి ఎదిగి మన ప్రాంతానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు అదే విధంగా యువత చదువుకోవడానికి ఏ అవసరం ఉన్నా మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అని అన్నారు.



## గేమ్ ఛేంజర్ తో రాజు.. మెగా ఫ్యామిలీ మధ్య బీటలు

**జయభేరి, హైదరాబాద్, మే 24:**

మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన నిర్మాతల్లో 'దిల్' రాజు ఒకరనేది నిన్న మొన్నటి వరకు ఇండస్ట్రీలో వినిపించేది. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందా? చిరు కుటుంబానికి రాజు దూరం అవుతున్నారా? లేదంటే మెగా ఫ్యామిలీని దూరం చేసుకుంటున్నారా? థియేటర్స్ బంద్ వివాదంలో ఆయన పేరు హైలైట్ కావడంతో ఇండస్ట్రీలో కొత్త పుకార్లకు బలం చేకూరుతోంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో 'దిల్' రాజు ప్రొడ్యూస్ చేసిన 'గేమ్ చేంజర్' సంక్రాంతికి విడుదలైంది. అబౌవ్ ఏవరేజ్‌గా నిలిచింది. ఈ సినిమా విడుదల సమయంలో 'దిల్' రాజు బిహేవియర్ డిస్కషన్ పాయింట్ అయింది. విక్టరీ వెంకటేష్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు సూపర్ హిట్ టాక్ రావడంతో 'గేమ్ చేంజర్'ను పూర్తిగా పక్కన పడేశారని మెగా ఫ్యాన్స్ బాగా ఫీల్ అయ్యారు. కొన్ని స్టేజీల మీద 'గేమ్ చేంజర్'తో వల్ల తనకు బాగా లాస్ వచ్చినట్లు ప్రొజెక్ట్ చేశారు. అల్లు అరవింద్ ఒక సినిమాతో కోట్లు పోగొట్టుకున్నారని కామెంట్ చేసినప్పుడు నవ్వారు దిల్ రాజు. ఆ తరుణంలో ఆయన వ్యవహార శైలి మెగా అభిమానులతో మెగా ఫ్యామిలీ సభ్యులకు కూడా ఆగ్రహం తెప్పించిందట. 'గేమ్ చేంజర్' సినిమాకు 'దిల్' రాజుతో పాటు జీ స్టూడియోస్ కూడా నిర్మాణ భాగస్వామి. ఫిలిం మేకింగ్‌లో ఖర్చు చేసిన డబ్బులు అన్నీ జీ స్టూడియోస్‌వి అట. 'దిల్' రాజు కేవలం ఎగ్జిక్యూట్ చేశారట. అయితే తనను తాను సోలో ప్రొడ్యూసర్ అన్నట్టు ఆయన ప్రొజెక్ట్ చేసుకోవడం, తన డబ్బులు మొత్తం పోయాయన్నట్లు పైకి అర్థమయ్యేలా చేయడం వంటివి చిరంజీవి, రామ్ చరణ్ దగ్గరకు వెళ్లాయట. నిర్మాణంలో ఎవరు ఎన్ని డబ్బులు పెట్టారు? ఎవరి వాటా ఎంత? అనేది కీలక సభ్యులకు తెలుసు కనుక 'దిల్' రాజు ప్రవర్తన వాళ్లను బాధించిందట. 'గేమ్ చేంజర్' మేకింగ్ కోసం 350 నుంచి 400 కోట్లు ఖర్చు అయితే నాన్ థియేట్రికల్ థియేట్రికల్ రైట్స్ ద్వారా సుమారు 250 నుంచి 300 కోట్లు వచ్చినట్టు ట్రేడ్ టాక్. ఆయనకు పోయినవి 50 కోట్లు అని, 'శాకుంతలం' లాస్ కూడా 'గేమ్ చేంజర్' లెక్కల్లో కలిపారని ఇన్‌సైడ్ గుసగుస. ఒక్క 'గేమ్ చేంజర్' వల్ల 200 కోట్ల లాస్ అని ఫేక్ లెక్కలు ప్రచారంలోకి తీసుకొచ్చి, కేవలం థియేట్రికల్ రెవెన్యూ గురించి మాత్రమే మాట్లాడుతూ నాన్ థియేట్రికల్ రైట్స్ ద్వారా వచ్చిన డబ్బు ఏమైందనేది సైడ్ చేశారు. 'గేమ్ చేంజర్' విడుదల తర్వాత మెగా ఫ్యామిలీతో 'దిల్' రాజు బంధానికి బీటలు వారితే... ఇప్పుడు 'హరిహర వీరమల్లు'తో అది మరింత ముదిరిందని ఇండస్ట్రీ వర్గాల గుసగుస. ఎవరు అవునన్నా కాదన్నా... 'దిల్' రాజు చేతిలో చెప్పుకోదగ్గ సంఖ్యలో సింగిల్ స్క్రీన్లు / థియేటర్లు ఉన్నాయి. డిస్ట్రిబ్యూషన్‌లో ఆయన కింగ్ పిన్. ప్రజెంట్ తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కూడా. ఆయనకు తెలియకుండా ఎగ్జిబిటర్లు సమావేశం కారనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాలలో ఉంది. పర్సంటేజీ సిస్టం కోసం పట్టుబడుతున్న వారిలో 'దిల్' రాజు కూడా ఉన్నారని వినబడుతోంది. ఇక్కడ ఆయన ఎగ్జిబిటర్‌గా వ్యవహరిస్తున్నారు. 'గేమ్ చేంజర్' ప్రీ రిలీజ్ వేడుకకు పవన్ కళ్యాణ్ అతిథిగా హాజరు కావడం మాత్రమే కాదు... 'వకీల్ సాబ్' ప్రొడ్యూస్ చేయడం ద్వారా జనసేన పార్టీని నడపడానికి అవసరమైన డబ్బులను తనకు రెమ్యూనరేషన్ రూపంలో 'దిల్' రాజు అందించారని గొప్పగా చెప్పారు. అటువంటిది ఇప్పుడు పవన్ 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందు థియేటర్లు బంద్ అంశాన్ని పైకి తీసుకురావడం పట్ల మెగా అభిమానులతో పాటు జనసేన శ్రేణులు ఆగ్రహంగా ఉన్నాయి. తమ హీరో సినిమా విడుదలకు ముందు కుట్రలు చేస్తున్నారని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇప్పటికి అయితే థియేటర్స్ బంద్ వెనక్కి వెళ్లింది. కానీ, దీని వెనుక సూత్రధారులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి 'దిల్' రాజుకు ఇష్టమైన హీరో పవర్ స్టార్. ఆయన పవన్ కళ్యాణ్ ఫ్యాన్. పవన్ సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేయడం వల్ల తాను ఆర్థికంగా నిలబడ్డానని ఆయన చెప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆయనకు ఇష్టమైన హీరో పవన్ కళ్యాణ్ అని 'దిల్' రాజు భార్య కూడా చెప్పారు.

# గులాబీలో కోవర్టుల కలకలం




**జయభేరి, హైదరాబాద్, మే 24:**

పార్టీలో కోవర్టులు ఉన్నారంటూ కవిత చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని... వాటి వల్లే పార్టీకి నష్టమంటూ కుండబద్ధలు కొట్టారు. తనపై కుట్ర చేశారని.. అందులో భాగంగానే లేఖను లీక్ చేశారని ఆరోపించారు. అయితే కవిత ఎవర్నీ ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారనేది హాట్ టాపిక్ గా మారింది. "ఎల్కతుర్తి సభ తర్వాత రెండు వారాల క్రితం పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాశా. అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావడం లేదు. కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖ లీక్ అయింది. దీన్ని బట్టి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నా పరిస్థితే ఇలా ఉంటే మిగిలిన వారి పరిస్థితేంటి? నా లేఖ లీక్ వెనుక ఎవరో ఉండి ఉండొచ్చు"... ఇవి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన తాజా వ్యాఖ్యలు..! లేఖ రాసింది నిజమేనని స్పష్టం చేసిన ఆమె... పార్టీలో కోవర్టులు ఉన్నారని... కేసీఆర్ చుట్టు దెయ్యాలున్నాయని ఆరోపించారు. అయితే కవిత చేసిన ఈ వ్యాఖ్యలు... పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అంతర్గతంగా రాసిన లేఖ ఎలా బయటికి వచ్చిందో అర్థం కావటం లేదని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. లేఖ లీక్ వెనక కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కవిత చేసిన ఈ ఆరోపణలతో అనేక అంశాలు తెరపైకి వస్తున్నాయి. అసలు కవిత లేఖను నేరుగా కేసీఆర్ కు ఇచ్చారా..? లేక ఎవరితోనైనా పంపారా..? అన్న ప్రశ్న ప్రధానంగా తెరపైకి వస్తోంది. అంతేకాదు రాసిన లేఖ కేసీఆర్ కు చేరినప్పటికీ... బయటికి లీక్ చేసిందెవరు..? చేయాల్సిన అవసరం ఏం వచ్చిందన్న చర్చ జరగుతోంది. పార్టీ అధినేతకు సొంత కుమార్తె కవిత అంతర్గతగా రాసిన లేఖ బయటికి రావటమంటే చిన్న విషయం కాదు. ఇదే అనుమానాన్ని కూడా కవిత కూడా వ్యక్తం చేశారు. తనకే ఇలాంటి పరిస్థితి ఉంటే... మిగిలిన వారి పరిస్థితేంటి అని ప్రశ్నించారు. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయని ముందుగానే చెప్పానని...అందులో భాగంగానే ఇదంతా జరిగిందని కూడా వ్యాఖ్యానించారు. లేఖ బహిర్గతం కావడంపై పార్టీలో ఉన్న అందరం ఆలోచించుకోవాల్సిన విషయమంటూ హితవు పలికారు. సొంత పార్టీలోని నేతలే కుట్రలు చేస్తున్నారని కవిత ఆరోపించటం సంచలనంగా మారింది.

అంతే కాదు కేసీఆర్ చుట్టు కొన్ని దెయ్యాలున్నాయని అన్నారు. ఈ కామెంట్స్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అధికారం కోల్పోయిన తర్వాత... కేసీఆర్ ఫామ్ హౌస్ కేంద్రంగానే రాజకీయాలు చేస్తున్నారు. సందర్భాన్ని బట్టి తెలంగాణ భవన్ లేదా నందినగర్ లోని తన నివాసానికి వస్తున్నారు. పైగా కేసీఆర్ చుట్టూ అతికొద్ది మంది నేతలే ఉంటారు. వీరిలో పార్టీలోని నేతలతో పాటు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. వీరిలో ఎవర్నీ ఉద్దేశించి... కవిత వ్యాఖ్యలు చేశారనేది అతిపెద్ద ప్రశ్నగా మారింది. తాజా పరిణామాల నేపథ్యంలో కవితపై నిజంగానే సొంత పార్టీ నేతలు కుట్ర చేశారా..? అన్న చర్చ గట్టిగా జరుగుతోంది. కవిత ఆరోపిస్తున్నట్లు కేసీఆర్ చుట్టు ఉన్న దెయ్యలెవరు..? లేఖను బయటపెట్టిన కోవర్టులెవరు..? కవితను టార్గెట్ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. కవిత వ్యాఖ్యల నేపథ్యంలో... గులాబీ బాస్ కేసీఆర్ రియాక్షన్ ఎలా ఉండబోతుందనేది కూడా ఉత్కంఠను రేపుతోంది..! కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ కవిత తీరు కూడా చర్చనీయాంశంగానే ఉంది. బీసీ అజెండాతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ జెండా కాకుండా... కవిత కేంద్రంగానే ఇదంతా నడుస్తోంది. జిల్లా పర్యటనలు చేస్తూ తమ మార్క్ ను చూపించే ప్రయత్నం చేస్తున్నారు. సామాజిక తెలంగాణ సాధించు కోలేపకపోయామంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. కొద్దిరోజుల కిందట మీడియాతో మాట్లాడిన కవిత... తనపై కుట్రలు చేస్తున్నారంటూ కూడా మాట్లాడారు. వాళ్లెవరో తనకు తెలుసని... టైమ్ వచ్చినప్పుడు బయటపెడతానంటూ వార్నింగ్ కూడా ఇచ్చారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండించాల్సిన బాధ్యత పార్టీపై కూడా ఉందంటూ ఆవేదనను వ్యక్తపరిచేలా మాట్లాడారు. అయితే కవిత... పార్టీలోని ఒక్కరిద్దరూ నేతలను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని పార్టీ అధినేత కేసీఆర్ దృష్టికి కూడా తీసుకెళ్లారని తెలుస్తోంది..! ఎమ్మెల్సీ కవిత తీరు చూస్తుంటే పార్టీలోని పరిస్థితులపై ఆమె తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే ఆమె చేస్తున్న వ్యాఖ్యలతో పాటు తాజాగా లేఖ లీక్ వంటి అంశాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయని చెప్పొచ్చు. పార్టీ నుంచి తనని సైడ్ చేస్తున్నారనే భావన ఆమెలో బలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. పార్టీలో తన ప్రియారిటీని తగ్గించే పరిణామాలు కనిపిస్తున్నాయనే భావనలో కూడా కవిత ఉన్నట్లు తెలుస్తోంది..! ఏది ఎలా ఉన్నా తమ నాయకుడు కేసీఆరే అని... ఆయన నాయకత్వమే తెలంగాణకు మేలు జరుగుతుందనే విషయం స్పష్టం చేయటంతో...ఆమెకు మరో ఆలోచన లేదనే విషయం కూడా చెప్పకనే చెప్పేసింది..!



## నూతన వధూవరులను ఆశీర్వదించిన వడ్త్య రమేష్ నాయక్



**జయభేరి, కొండమల్లె పల్లి :**

కొండమల్లెపల్లి మండలం సంజీవని ట్రస్ట్ దగ్గర ఉన్న ప్రేమ్ గార్డెన్ ఏసీ కన్వెన్షన్ లో నిర్వహించిన వివాహ కార్యక్రమంలో సీత వెంకటమ్మ వెంకటయ్య ల కుమార్తె మల్లీశ్వరి మల్లికార్జున వివాహ వేడుక కొండమల్లెపల్లి ప్రేమ్ గార్డెన్ ఏసీ కన్వెన్షన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాజరై నూతన వధూవరుల ను ఆశీర్వదించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి గుడి నిర్మాణానికి 50వేల రూపాయలు విరాళం



**జయభేరి, పీఏ పల్లి :**

పీఏ పల్లి మండలం అజ్మాపురం గ్రామపంచాయతీలో ని కొట్టాలగడ్డ తండ లో ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి కొట్టంగడ్డ వాస్తవ్యులు బాణా వత్ కిషన్ నాయక్, సంతోష్ నాయక్ అడగడంతో వెంటనే మంచి మనసుతో పలుగు తండ రమావత్ బాలాజీ నాయక్. ఆంజనేయ స్వామి గుడి నిర్మాణానికి 50వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో లాలు, శివ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పూస్తే మట్టెలు అందజేసిన వెంకటేష్ గౌడ్



**జయభేరి, గజ్వేల్, మే 23 :**

పేదింటి పెండ్లికి పూస్తే మట్టెలు అందజేసి శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ అండగా నిలిచారు. వర్గల్ మండలం వేలూరు గ్రామానికి చెందిన అచయపల్లి సంజీవ్, ఎల్లవ్వ కూతురు వివాహానికి పూస్తే మట్టెలు అందజేసి ఆర్థికగా తోడున్నారు. ఆడ బిడ్డలకు పూస్తే మట్టెలు సహాయం చేస్తూ తనకు తోచిన సహాయం చేస్తున్నానని తెలిపారు. దయానియ స్థితిలో ఉన్న ఆ పేద కుటుంబాని అదుకోవడానికి చిరు సహాయం అందించామన్నారు. ఇకముందు కూడా వీలైనంత వరకు సహాయం చేస్తానని వారు తెలిపారు.




# హృదయం లోపల.. ఖననం జరిగెనా..

దేవరకొండ విజయ్ హీరోగా రూపొందుతోన్న ప్రస్టేజియస్ పానిండియా ప్రాజెక్ట్ 'కింగ్‌డమ్' ప్రమోషన్స్‌తో దూసుకుపోతున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్న నేపథ్యంలో.. శుక్రవారం ఈ సినిమాలోని తొలి గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'ఏదో ఏదో గమ్మత్తులా.. ఏంటీ కలా.. ఏంటీ కలా.. ఏదో ఏదో అయ్యేంతలా.. గుండె అలా.. ముంచేనిలా.. హృదయం లోపల.. ఖననం జరిగెనా..' అంటూ సాగే ఈ పాటను కె.కె. రాయగా, అనిరుధ్ రవిచందర్ స్వరపరిచి, అనుమిత నదేశన్‌తో కలిసి ఆలపించారు. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సేలపై ఈ పాట చిత్రీకరించారు. కథలో భాగంగా సాగే మాంటేజ్ సాంగ్ ఇది. హీరో క్యారెక్టరైజేషన్, హీరోహీరోయిన్ల మధ్య సాగే రహస్య ఒప్పందం.. తద్వారా వారిమధ్య చిగురించిన ప్రేమబంధం.. ఇవన్నీ ఈ పాటలో దర్శనమిస్తున్నాయి. ఈ పాటను బట్టి చూస్తే.. విజయ్ దేవరకొండ కిల్లర్‌గా, భాగ్యశ్రీ బోర్సే డాక్టర్‌గా కనిపిస్తున్నారు. పాట కూడా శ్రావ్యమైన సంగీతంతో వినసొంపుగా సాగింది. పిక్చరైజేషన్ కూడా ట్రెండీగా, కథపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ పాట విడుదల సందర్భంగా సంగీత దర్శకుడు అనిరుధ్‌కి హీరో విజయ్ దేవరకొండ ఎక్స్(ట్విటర్) ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. '3, వీఐపీ చిత్రాల టైమ్‌లోనే అనిరుధ్ సంగీతానికి అభిమానిని అయిపోయా. అతనితో కలిసి పనిచేయాలనే కోరిక ఎప్పట్నుంచో ఉండేది. హీరోనైన పదేళ్ల తర్వాత నా పదమూడో సినిమాకు అది సాధ్యమైంది. మా తొలి కలయికలో మొదటి గీతం విడుదల కావడం సంతోషంగా ఉంది.' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది.

# ఇప్పుడు అందరి సలహాలు వింటున్నా!



ముంబయిలో జరుగుతున్న వేవ్స్ (ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్) సదస్సులో పాల్గొన్న అగ్ర నటుడు అల్లు అర్జున్ తన కెరీర్‌తో పాటు పలు వ్యక్తిగత అంశాలపై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. డీజే, నా పేరు సూర్య చిత్రాలు పరాజయం పాలవ్వడంతో దాదాపు ఏడాదిన్నర పాటు సినిమాలకు దూరంగా ఉన్నారు అల్లు అర్జున్. ఈ చిత్రాల విడుదలకు ముందు తాను ఎవరి సలహాలు పాటించలేదని, జీవితం పట్ల ఉదాసీన వైఖరితో ఉన్నానని బన్నీ తెలిపారు. "నా పేరు సూర్య' రిలీజ్‌కు ముందు నా శ్రేయోభిలాషులు కొందరు కెరీర్ విషయంలో మంచి సూచనలు చేశారు. నేను పట్టించుకోలేదు. అంతా నేను అనుకున్నట్లే జరుగుతుందనుకున్నా. కానీ సినిమా ఫెయిల్యూర్ తర్వాత ఆరు నెలల బ్రేక్ తీసుకోవాలనుకున్నా. అది కాస్త 15 నెలలు అయింది. ఆ టైమ్‌లో నేను ఆత్మవిమర్శ చేసుకున్నా. ఇతరుల సలహాలు తీసుకోవడంలో తప్పులేదనిపించింది. అప్పటి నుంచి లైట్ బాయ్ సలహాలు కూడా స్వీకరించడానికి వెనకాడటం లేదు. కొందరు వ్యక్తిత్వ నిపుణుల సలహాలు తీసుకుంటూ కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నా' అని అల్లు అర్జున్ చెప్పారు. అట్లీ దర్శకత్వంలో చేయబోతున్న పాన్ వరల్డ్ సినిమా గురించి మాట్లాడుతూ..ఇప్పటివరకు భారతీయ సినిమాలో రానటువంటి కాన్సెప్ట్ ఇదని, భారతీయ మూలాలున్న ఈ కథని అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కించబోతున్నామని చెప్పారు. సినిమాల్లోకి రావడానికి తన మావయ్య చిరంజీవి స్ఫూర్తినిచ్చారని, ఆయన ఎన్నో గొప్ప విజయాలను చూసి కూడా వినమ్రంగా ఉంటారని, తనలాంటి నటులకు ఆయనే ఆదర్శమని అల్లు అర్జున్ అన్నారు.



# స్టన్నింగ్ హారిక..

దేత్తడి హారికకు యూట్యూబ్ స్టార్ గా తెలుగు రాష్ట్రాల్లో మంచి క్రేజ్ ఉంది. హైదరాబాద్ యాసలో మాట్లాడుతూ.. యూట్యూబ్ లో అందరికీ ఇచ్చిపడేసే వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ ఆయన ఈ బ్యూటీ అసలు పేరు అలేఖ్య హారిక. దేత్తడి హారిక బిగ్ బాస్ సీజన్ 4లో ఒక కంటెస్టెంట్ అని మనకి తెలిసిందే. హౌజ్‌లో తనదైన అల్లరి పనులతో టాప్ 5లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా తన ఇంస్టాగ్రామ్ అకౌంటులో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది ఈ భామ. 9 సెప్టెంబర్ 1997న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది అందాల తార అలేఖ్య హారిక. ఈ బ్యూటీకి వంశీ కార్తీక్ అనే ఒక సోదరుడు కూడా ఉన్నాడు. హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో స్కూలింగ్ విద్య పూర్తిచేసింది. మెహదీపట్నంలో ఉన్న సెయింట్ ఆన్స్ కళాశాల నుంచి బ్యాచలర్ అఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి డిగ్రీ పట్టా పొందింది ఈ వయ్యారి భామ. అలేఖ్యకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్‌పై మక్కువ ఎక్కువ. చిన్నప్పటి నుంచి కొరియోగ్రాఫర్ కావాలని కోరిక. 2015లో ఆమె హైదరాబాద్‌లోని అమెజాన్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరింది. అలేఖ్య దాదాపు మూడు సంవత్సరాలు అక్కడ పని చేసింది.

# కవ్విస్తున్న క్రేజీ బ్యూటీ..

అయేషా ఖాన్ తెలుగు, హిందీ చిత్రాలతో పాపులర్ అయ్యింది. ముంబైలో జన్మించిన ఈ ముద్దుగుమ్మ సోదరుడు షహబాజ్ ఖాన్ ఇండియన్ మర్చంట్ నేవీలో అధికారి. ఈ అమ్మడు తన అందం, అభినయంతో ఆకట్టుకుంటుంది. అయేషా 2020లో ఏక్తా కపూర్ యొక్క డైలీ సోప్ కసౌతీ జిందగీ కేలో జూనియర్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. 2019లో బాలవీర్ రిటర్న్స్ షోలో బిర్బా పాత్రలో నటించి గుర్తింపు పొందింది. 2022లో తెలుగు చిత్రం ముఖచిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఓం భీమ్ బుష్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, మనమే వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ఓం భీమ్ బుష్లో ఆమె గ్లామరస్ పాత్రకు మంచి గుర్తింపు లభించింది. 2023లో హిందీ బిగ్ బాస్ సీజన్ 17లో కంటెస్టెంట్‌గా పాల్గొని, స్టార్‌డమ్‌ను సంపాదించింది. ఈ షో ఆమెను దేశవ్యాప్తంగా గుర్తించేలా చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ బ్యూటీ సిజ్లింగ్ డ్యాన్స్ రీల్స్ ద్వారా సోషల్ మీడియా సంచలనంగా మారింది, అయేషా ముంబైలో నివసిస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. ఈ బ్యూటీ తన ఫ్యాషన్, డ్యాన్స్ వీడియోలతో అభిమానులను ఆకర్షిస్తుంది.






# థియేటర్‌లో హిట్ 3 మిస్ అయ్యారా..

## అయితే ఓటీటీలో చూసేయండి.. స్ట్రీమింగ్ ఎప్పటి నుంచి?

నేచురల్ నాని వైవిధ్యమైన చిత్రాలు చేస్తూ ప్రేక్షకులని ఎంతగానో అలరిస్తున్నారు. నటుడిగానే కాకుండా నిర్మాతగాను సత్తా చాటుతున్నారు. అయితే ఇటీవల నాని ప్రధాన పాత్రలో రూపొందిన హిట్ 3 చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మేడే కానుకగా ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. నాని గత సినిమాలతో పోల్చితే ఇందులో రక్త పాతం, హింస ఎక్కువైందని విమర్శలు వచ్చినా ఆడియెన్స్ కు మాత్రం హిట్ 3 చిత్రం మాంచి కిక్ ఇచ్చింది. వంద కోట్ల కలెక్షన్స్ అవలీలగా దాటి అందరిని అబ్బురపరిచింది.

ఇక ఓటీటీలో ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వారికి గుడ్ న్యూస్ చెప్పింది చిత్ర బృందం. హిట్ 3 రిలీజ్ అయిన నాలుగు వారాలకు ఓటీటీలో రాబోతోంది. మే 29 నుంచి ఈ సినిమాను నెట్ ఫ్లిక్స్ స్ట్రీమింగ్ చేయబోతున్నట్టు తెలియజేశారు. హిట్ 3 కోసం ఎదురు చూస్తున్న వారు మరికొన్ని రోజులు వెయిట్ చేస్తే ఈ మూవీని ఇంట్లో కూర్చొని చూస్తూ ఎంజాయ్ చేయవచ్చు. ఇక ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా అడివి శేష్, కార్తీలు సాలిడ్ క్యామియో పాత్రల్లో నటించారు.

హిట్ 3 సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ఓటీటీ దిగ్గజ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా, ఇందుకోసం రూ. 50 కోట్లకు పైగానే చిత్ర బృందానికి చెల్లించినట్లు సమాచారం. నాని, శైలేష్ కొలను కాంబోలో హిట్ 3 చిత్రం మొదట మిక్స్డ్ టాక్ తెచ్చుకుంది. టాక్‌తో సంబంధం లేకుండా హిట్ 3 సినిమాకు మంచి కలెక్షన్లు అయితే వచ్చాయి. థియేటర్‌లో అదరగొట్టిన ఈ చిత్రం ఓటీటీలో ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందా అనేది చూడాలి. దసరా, సరిపోదా శనివారం సినిమాల హిట్స్‌తో దూకుడు మీదున్న నాని హిట్ 3తో తన హిట్ ట్రాక్ కంటిన్యూ చేశాడు. శైలేష్‌కొలను శ్రీకారం చుట్టిన హిట్ ఫ్రాంచైజీలో థర్డ్ కేస్‌గా ఈ సినిమా తెరకెక్కించారు. టీజర్, ట్రైలర్, ప్రమోషనల్ కార్యక్రమాలతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అనుకున్నట్లుగానే బాక్సాఫీస్ వద్ద హిట్ 3 మెరుగైన ప్రదర్శన చేసింది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com